## 'మేడే' విజయవంతం చేయండి




**ప్రజాపక్షం/గజ్వేల్:** ప్రపంచవ్యాప్త141వ మేడేను విజయ వంతం చేయాలని ఏఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యులు శివలింగ కృష్ణ స్పష్టం చేశారు. శుక్రవారం గజ్వేల్ లో మేడే పోస్టర్ ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి సర్కార్ తెస్తున్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసేంత వరకు పోరాటం చేద్దామని తెలిపారు. మేడేను పండుగ వాతావరణంలో జెండా ఆవిష్కరణ చేసుకుని ఘనంగా జరుపుకుందామని వివరించారు. సిపిఐ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం, గజ్వేల్ మార్కెట్ కమిటీ హమాలి సంఘం అధ్యక్షులు శ్రీను పాల్గొన్నారు.

## భూభారతి రీసర్వేపై అవగాహన

### హాజరైన నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి




**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట :** మండలంలోని చింత లక్ష్మాపూర్, కమలాపూర్ గ్రామాల్లో భూభారతి రీసర్వేపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని రైతులకు సూచనలు చేశారు. రీసర్వే ద్వారా భూముల హద్దులు, రికార్డులు స్పష్టంగా లభిస్తాయని, పాత భూ వివాదాలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రైతులు సర్వే సమయంలో తమ భూముల సరిహద్దులను చూపించి, తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతికతతో పారదర్శకంగా సర్వే జరుగుతుందని పేర్కొంటూ, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. తాసిల్దార్ ప్రభుదాస్, ఎంపీడీఓ క్రాంతి కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## గ్రామ స్వరాజ్యమే దేశానికి బలం



**ప్రజాపక్షం/కెరమెరి :** గ్రామ స్వరాజ్యమే దేశానికి బలమని, గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని ఇంచార్జ్ ఎంపిడిఒ సాయిరాం గౌడ్ పిలుపునిచ్చారు. కెరమెరి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పెందోర్ ఆనందరావు అధ్యక్షతన శుక్రవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వచ్ఛతపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సాయిరాం గౌడ్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారానే గ్రామాలు బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. సర్పంచ్ పెందోర్ ఆనందరావు మాట్లాడుతూ గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్థానిక పాలనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, అభివృద్ధికి కలిసికట్టుగా సహకరించాలని కోరారు. పారదర్శకమైన పాలనతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శి గణేష్, ఉప సర్పంచ్ శ్రీకాంత్, వార్డు సభ్యులు ఆత్రం రాజ్ కుమార్, గేడం మాన్కు, సాగర్, సుభద్ర, బామ్నే శ్రీకాంత్, రాథోడ్ శ్రీకాంత్, అబ్దుల్ సమాద్, ఖాతున్ భీ, కారోబార్ వెంకన్న పాల్గొన్నారు.

## డా. నాగమోహన్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గాబాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ డాక్టర్ నాగమోహన్‌ను బీసీటీయు ఆధ్వర్యంలో ఆస్పత్రిలోని ఆయన ఛాంబర్‌లో కలిసి శాలువ, పూలబుకెతో ఘనంగా సన్మానించి సావిత్రిబాయి పూలే జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ మాట్లాడుతూ సేవా గుణంపేదల పక్షపాతి అయిన నాగమోహన్ జిల్లా ఆస్పత్రికి సూపరింటెండెంట్‌గా రావటంతో పేదలకు ఆరోగ్యపరంగా మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షులు పెద్దోల్ల నాగరాజు, బీసీటీయు అసోసియేట్ అధ్యక్షులు మోహన్, గౌరవ అధ్యక్షులు కైరంకొండ బాబు, కార్యనిర్వాహఖ అధ్యక్షులు కంచరి రవికుమార్, కొట్టాల రామకృష్ణ, గౌరవ సలహాదారులు రమణస్వామి, కోశాధికారి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్, వేణు, రవిచంద్ర, సుమన్, మనోజ్ పాల్గొన్నారు.

## తగిన జాగ్రత్తలతో ఉపాధి పనులు



**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ మండల వ్యాప్తంగా జరుగుతున్న ఉపాధి హామీ పనులను డీఆర్‌డీఓ పీడీ రవీందర్ శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడి, వేసవి ఎండల తీవ్రమవుతున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రత తక్కువగా ఉన్న సమయంలోనే పనులు ముగించుకోవాలని, అపాయాలకు గురికాకుండా చూసుకోవాలని కోరారు. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, విశ్రాంతి కోసం గ్రీన్ టెంట్లను అందుబాటులో ఉంచామని క్షేత్ర సహాయకులను ఆదేశించారు. ఎండల దృష్ట్యా కూలీల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ పనులు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపిడివో శేఖర్, ఏపీఓ వసంతరావు, వదూర్ సర్పంచ్ శ్రీకాంత్, సాంకేతిక సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలందరికీ తెలిసేలా... వాస్తవాలు ప్రచురించాలి

### కలెక్టర్, మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/నస్పూర్ :** మీడియా సంస్థలు ప్రజలందరికీ వాస్తవాలు తెలిసేలా వార్తలు ప్రచురించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా పౌర సంబంధాల అధికారి, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనర్ మాదంశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దినపత్రికలు, న్యూస్ చానళ్లు ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని తెలిపారు. 2026–28 సంవత్సరాలకు గాను ప్రభుత్వ ఉత్తర్వులు 252, ఆర్‌టి 103 ప్రకారం అర్హత గల వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేయడంలో కమిటీ ప్రభుత్వ ఉత్తర్వుల మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు. సరైన గుర్తింపు, అర్హత లేనివారు పాత్రికేయులుగా చలామణి కావడంతో అసలైన పాత్రికేయులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులను కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హత గ ల వారిని ఎంపిక చేయాలని తెలిపారు.జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు అల్లువెల్లి రమేష్ రెడ్డి, గొల్లపల్లి సిద్ధార్థ, పార్వతి సురేష్ కుమార్, డేగ సత్యనారాయణ, మొహమ్మద్ ఇమాద్ ఉద్దీన్, రూపిరెడ్డి ప్రకాష్ రెడ్డి, అయినంపూడి నవీన్ కుమార్, గొల్లన నరేష్, బెక్కం సదానందం, మొదంపురం సంతోష్, జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయ సిబ్బంది కొల్లూరి సంపత్ కుమార్, రవితేజ, మంత్రి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

## ఇల్లు లేనివారికి మొదటి ప్రాధాన్యత

### ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించిన కలెక్టర్



**ప్రజాపక్షం/మెదక్ :** నిరుపేదల సొంత ఇంటి కళను నెరవేర్చడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని తీసుకొచ్చిందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మెదక్ మండలం శివ్వాయపల్లి గ్రామంలో శుక్రవారం పండుగ వాతావరణంలో లబ్దిదారుల ఇల్లు గృహ ప్రవేశానికి కలెక్టర్ హాజరై ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. శివాయపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారులు తోట లక్ష్మి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కోసం ప్రభుత్వం విడుదలవారీగా నిధులు విడుదల చేస్తున్నారు. ఒక్కో గృహ నిర్మాణానికి ఐదు లక్షలు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 750 ఇందిరమ్మ ఇండ్లు పూర్తయ్యాయని, మిగిలిన వారు కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 650 ఇండ్లు గృహప్రవేశాలు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా హౌసింగ్ పీడీ మాణిక్యం మెదక్ ఆర్డీఓ రమాదేవి, తాసిల్దార్ లక్ష్మ ణ్ బాబు, సర్పంచ్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## శంకర్ గౌడ్‌ది ప్రభుత్వ హత్యే

### ఎఐటియుసి నాయకులు వీరభద్రయ్య, బాజీ సైదా




**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** ఆర్‌టిసి కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్య ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా విమర్శించారు. శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లే శంకర్ గౌడ్ క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం అందించి, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు కోరారు.

## నైపుణ్యాభివృద్ధితోనే భవిష్యత్‌పై విజయం

### అడిషనల్ కలెక్టర్ పాండు



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల్లో బాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్‌సి, ఎస్‌టి బిసి, మైనార్టీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమం జరిగింది.అడిషనల్ కలెక్టర్ పాండు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ముందుగా తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకోవడం అత్యంత కీలకమని తెలిపారు. మీరు ఏం కావాలను కుంటున్నారు. ఏరంగంలో రాణించాలనుకుంటున్నారు. అనే ప్రశ్నలకు సమాదానం తెలుసుకుని ఆ దిశగా క్రమశిక్షణతో పయనిస్తే విజయాన్ని అందుకోవడం సులభమవుతుందని సూచించారు. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానం సరిపోదని, నైపుణ్యాల అభివృద్ధి ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ టెక్నికల్ నైపుణ్యాలు సమస్యలను పరిష్కరించే సామర్థ్యం వంటి అంశాలు, విద్యార్థులను మరింత ముందుకు తీసుకెళ్లాయని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ తరహా శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యతుకు బాటలు విద్యార్థులను ప్రొత్సహించారు. విజయం ఒక్క రోజుల్లో సాధ్యం కాదని నిరంతర శ్రమ, పట్టుదల,క్రమ శిక్షణ ఉంటే లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. వైఫల్యాలను భయపడకుండా వాటిని పాఠాలుగా తీసుకుని మరింత దైర్యంగా ముందుకు సాగాలని విద్యార్థుల కు సూచించారు. అలాగే తమ సామాజిక నేపథ్యాన్ని అడ్డంకిగా కాకుండా అవకాశంగా మలుచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు శిక్షణ కార్యక్రమాలు అందరికి అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవడమే విజయానికి మొదటి అడుగని అన్నారు.డిడి సోషల్ వెల్ఫేర్, ఆఫీసర్, అకిలేష్ రెడ్డి, ఎస్సీ కార్పోరేషన్ ఈడి రామాచారి జిల్లా బిసి సంక్షేమ అధికారి జగదీష్ రెస్ట్ డైరెక్టర్ రాజేష్, కుమార్, టైనర్ అరవింద్ స్కిల్ డెవలప్‌మెంట్, టైనర్ కె కృష్ణ కుమార్, మోటివేటర్, కూన వేణు, రాజు రాథోడ్ తదితరులు పాల్గొని విద్యార్థులకు నైపుణ్య శిక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బిసి ఎస్‌సి, ఎస్‌టి హాస్టళ్లలోని డిగ్రీ విద్యార్థులు వివిధ సంక్షేమ శాఖల అధికారులు సిబ్బందిపాల్గొన్నారు.

## ఎంఎన్‌ఎం పరీక్షా ఫలితాలు విడుదల చేయాలి

### ఎఐటియూసి జిల్లా.. ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్



**ప్రజాపక్షం/రెబ్బన :** మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్ పరీక్షా ఫలితాలను వెంటనే వెల్లడించాలని కోరుతూ ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే నిరసనలను విజయవంతం చేయాలని ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం రెబ్బన మెడికల్ ఆఫీసర్ రిషికకు ఎఐటియుసి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 డిసెంబర్ 29న నిర్వహించిన నోటిఫికేషన్ నం. 2/2023కు సంబంధించి ఎందరో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎఎన్‌ఎంలు పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఎన్నికల కోడ్, కోర్టు కేసుల సాకుతో ఫలితాల వెల్లడిలో జాప్యం చేయడం వల్ల వయోపరిమితి ముగిసే దశలో ఉన్న అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితాల విడుదలపై స్పష్టత ఇవ్వకుంటే 27న నిరసన నిద్ర, 28న మహా ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఖాళీల సంఖ్యను పెంచి ఫలితాలు ప్రకటించడంతో పాటు, ఉద్యోగం రాని వారికి 100 శాతం గ్రాస్ శాలరీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండో పీఆర్సీ ఏడు నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని, 10 లక్షల హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. మరణించిన ఏఎన్‌ఎంల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు ప్రమీల, సునీత, వనిత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** కాళేశ్వరం ప్రాజెక్టులో ఎటువంటి అవినీతి జరగలేదని, మాజీ సిఎం కేసీఆర్ హరీష్‌రావు పె ఎటువంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి సిఎం రేవంత్‌రెడ్డికి గట్టి చెంప పెట్టు లాంటిదని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాలను ఈ తీర్పు పూర్తిగా ఖండించిందన్నారు. ఈ తీర్పుతో తెలంగాణ ప్రజలకు, రైతులకు అసలు నిజం తెలిసిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇప్పటివరకు మొత్తం అయినా ఖర్చు సుమారు రూ.94 వేల కోట్లు అయితే, లక్ష కోట్ల అవినీతి జరిగిందని దుష్ప్రచారం చేయటం కాంగ్రెస్ నాయకుల అజ్ఞానానికి నిదర్శనమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే ఒక్క మేడిగడ్డ బ్యారేజీ మాత్రమే కాదని అందులో 3 బ్యారేజీలు, 16 రిజర్వాయర్లు, 21 పంపుహౌస్‌లు, 19 సబ్‌స్టేషన్లు 203 కిలోమీటర్ సొరంగాలు, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెన్స్, 1531 కిలోమీటర్ గ్రావిటీ కెనాల్స్ వేల కిలోమీటర్ల పిల్లకాలువలు విజయవంతంగా కేసీఆర్ నిర్మించారని గుర్తు చేశారు.

## ఆర్టీసి కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడొద్దు

### సిపిఐ కార్యదర్శి భుక్యా రమేష్ పిలుపు

**ప్రజాపక్షం/ నిర్మల్ రూరల్ :** ఆర్టీసి కార్మికులు మనోధైర్యాన్ని కోల్పోయి ఆత్మహ్యాతల వంటి తీవ్ర నిరణయాలు తీసుకోవద్దని సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి భుక్యా రమేష్ కోరారు. శుక్రవారం నిర్మల్‌లో ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, కార్మికుల సమస్యలు ఆత్మహత్యలతో పరిష్కారం కావని, ఐక్య పోరాటాల ద్వారానే హక్కులను సాదించుకోవాలని పిలుపునిచ్చారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసి కార్మికుడు శంకర్ గౌడ్ మృతి పట్ల భుక్యా రమేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ మరణం అత్యంత భాధాకరమని పేర్కొన్న ఆయన, మృతుని కుటుంబానికి సిపిఐ జిల్లా సమితి తరపున ప్రగాఢ సానుభూతిని , సంతాపాన్ని తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా రవాణాలో అహర్నిశలు శ్రమిస్తున్న ఆర్టీసి కార్మికులకు తగిన గౌరవం వేతనాలు, ఉద్యోగ భద్రత లభించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, మృతుడి కుటుంబానికి భారీ ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు ఆర్టీసిని బలోపేతం చేసి కార్మికుల్లో భరోసా కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని , పెండింగ్ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని భుక్యా రమేష్ స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో కార్మికుల పక్షాన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఆర్టీసి కార్మికుల మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత

### టియుసిఐ, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజన్న, జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి డిమాండ్




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జేఏసి పిలుపు మేరకు చేపట్టిన సమ్మెమూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్మల్ డిపో ముందు జరుగుతున్న సమ్మె శిభిరంలో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.రాజన్న ఎఐటియుసి గౌరవ అధ్యక్షుడు ఎస్.ఎన్ రెడ్డి పాల్గొని తమ పూర్తి మద్దతును ప్రకటించారు. ఆర్టీసి కార్మికుల వరుస మరణాలకు రేవంత్ రెడ్డి సర్కారే పూర్తి బాధ్యత వహించాలని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేసిన సమయంలో తాము అధికారంలోకి వస్తే ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసి ఆదుకుంటామని ప్రతిపక్ష హోదాలో రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను ఇప్పుడు తుంగలో తొక్కారని ఆయన విమర్శించారు. అధికారుల ఇష్టానుసారమైన చర్యలు, పనిగంటల పెంపు మరియు తీవ్రమైన పని ఒత్తిడి కారణంగా కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారని, ముఖ్యంగా గుండె జబ్బులతో ప్రాణాలు కోల్పోతున్నారని మండిపడ్డారు. లాభార్జనే ధ్యేయం కాకుండా సేవా దృక్పథంతో పనిచేస్తున్న సంస్థలో కార్మికులను పీల్చి పిప్పి చేయడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి చర్చలు జరపాలని, లేని పక్షంలో గత కేసీఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా పడుతుందని ఆయన హెచ్చరించారు.ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి పిడిఎస్‌యూ జిల్లా కన్వీనర్ కిరణ్ ఆర్టీసి జేఏసి నాయకులు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## అక్రమ వడ్డీ వ్యాపారులపై పోలీస్ 'స్ట్రైక్'..

### 15 కేసులు నమోదు

### ఎస్‌పి అఖిల్ మహాజన్

**ప్రజాపక్షం/నేరడిగొండ:** అమాయక ప్రజలు రైతుల బలహీనతలను ఆసరాగా చేసుకుని, అధిక వడ్డీలతో పీడిస్తున్న వడ్డీ వ్యాపారులపై జిల్లా పోలీస్ యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. జిల్లా ఎస్‌పి అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు శు క్రవారం ఏకకాలంలో45 బృ ం దాలు 15 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆకస్మిక దా డులు నిర్వహించాయి.15 కేసులు నమోదు చేసి, భారీగా ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు, ఖాళీ చెక్కులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి తెలిపారు.

### ఆకస్మిక దాడుల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలు

జిల్లాలోని 16 మండలాల్లో సుమారు వంద మంది వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై పోలీసులు దాడులు చేశారు. లైసెన్స్ లేకుండా అక్రమంగా వ్యాపారం చేస్తూ, రైతుల వ్యవసాయ భూముల పాస్ బుక్కులు తాకట్టు పెట్టుకొవడం, ఖాళీ స్టాంపు పేపర్లపై సంతకాలు తీసుకోవడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. సోదాల్లో భాగంగా ప్రామిసరీ నోట్లు, బ్యాంక్ చెక్కులు, భూమి సేల్ డీడ్స్ వంటి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను ఎస్పీ ప్రకటించారు. ఆదిలాబాద్ టూటౌన్‌లో నాయిని సుదర్శన్, తలమడుగులో కటకం రాజు, శ్రీనివాస్, మావలలో కుంటి లింగన్న, దుర్గారెడ్డిలపై కేసులు నమోదయ్యాయి. నేరడిగొండలో గంగారెడ్డి, శ్రీనివాస్, జుంబేరాత్ రాహుల్, తాంసిలో ఉప్లంచి నగేష్, గంభీర్, ఇచ్చోడలో గౌతి సుందర్ సింగ్, గిట్టే మారుతి, కడమ్



సుదర్శన్, సాయికృష్ణలపై కేసులు నమోదు చేశారు. గుడిహత్నూర్‌లో దహేలే పవన్‌పై కేసు నమోదైంది. అక్రమార్కుల ఆటలు కట్టడి చేస్తామని, ప్రజలను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

## ఆత్మబలిదానాలు వద్దు.. హక్కుల సాధనకు కలిసి పోరాడుదాం

### ఎమ్మెల్యే చింతాప్రభాకర్

**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** ఆర్టీసీ కార్మికుల హక్కుల సాదన కోసం సంఘటితంగా కలిసి పోరాడుదాం తప్ప కార్మికులు ఎవ్వరూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ఆర్టీసీ కార్మిక సోదరుడు శంకర్ గౌడ్ ఆత్మ బలి దానం చేసుకోవడం తీవ్రంగా కలిచివేసిందని , ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నామని, ఆర్టీసీ కార్మికులు ఎవ్వరూ ఆత్మబలిదానాలకు ఒడి గట్టవద్దని విజ్ఞప్తి చేస్తున్నాని, రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్లక్ష్యం వల్ల ఆర్టీసీలో ఇలాంటి పరిస్థితి వచ్చిందని శంకర్ గౌడ్ ఆత్మ బలిదానం కు కాంగ్రెస్ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యతని అదికారంలోకి రాగానే ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి మాట తప్పారని, పీఆర్‌ఎస్ లతో పాటు కార్మికుల డిమాండ్లు ఏవీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడం లేదన్నారు. మేనిఫెస్టోల్ ఇచ్చిన వాగ్దానాలు సైతం అమలు చేయకుండా రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తున్నాడని, రేవంత్‌రెడ్డి ఇంకా ఎంత మంది ప్రాణాలు బలి తీసుకుంటావు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడుదాం అని మీ వెంటే మేమున్నామని చింతాప్రభాకర్ ఆర్టీసీ కార్మికులకు భరోసా ఇచ్చారు.ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటిని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమస్యల నివారణకు తక్షణ చర్యలు చేట్టి వారిలో విశ్వాసం కల్పించాలని కోరారు.

